

'మన తాతలు నదుల్లో నీళ్లను చూశారు. వాటినే ఆనందంగా తాగారు. మన నాన్నలు బావుల్లో చేదుకుని చల్లటి నీటిని ఆస్వాదించారు. ఈ తరం నల్లా నీళ్లను రుచి చూసింది. ఇప్పటి పిల్లలు.. నీళ్లను బాటిళ్లలోనే చూస్తున్నారు. ఇక.. రాబోయేతరం పరిస్థితి ఏమిటి?.. వాళ్లు నీళ్లను క్యాప్సూళ్లలో పట్టుకుంటారా?' అంటూ ఇటీవల వైరల్ అవుతున్న ఓ వీడియో చూసిన ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేయడమే కాదు.. భవిష్యత్ తరాల విషయంలో భయాన్నీ కలుగజేస్తున్నది. అవును.. ఉద్ధృతంగా ప్రవహించే నదీ జలాలను అరచేతుల్లో పట్టుకుని అమాంతంగా తాగినా ఆరోగ్యంగా ఉన్న నాటి తరం వాళ్లతో మనల్ని పోల్చుకోలేం. బాటిల్ నీరు తప్ప, బయటివి తాగితే అనారోగ్యం పాలయ్యే నేటి తరానికి ముందు తరాలు ఎలా ఉంటాయో ఊహించడం నిజంగానే వెన్నులో వణుకు పుట్టించే విషయం. ఆ ముందు తరం ఎంతో దూరంలో లేదు. మహా అయితే మన మనవళ్లు, మనవరాళ్లు, మునిమనవరాళ్లు. 'ఆ రోజుల్లో ఒక్కొక్కరు అరగంట స్నానం చేసేవారట. మా కార్లైతే స్వచ్ఛమైన నీళ్లతో కడిగేవారట' అంటూ మా పూర్వీకులు మహారాజులు అన్నంత గొప్పగా చెప్పుకొనే రోజులు వాళ్లకు రావని ఎవరు చెప్పగలరు. ముందుతరం సంగతేల... నేటికే అలాంటి పరిస్థితి ఎదుర్కొంటున్న దేశాలు మన కండ్లముందే ఉన్నాయి. తమకంటూ ఒక్క పెద్దనది కూడా లేకున్నా అభివృద్ధిలో ఆకాశాన్ని అంటుతున్న రాజ్యాలూ ఈ భూమి మీద ఉన్నాయి. సమన్వయంతో సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న చిన్నదేశాల పెద్ద ప్రయత్నాలూ.. వెతికితే ఇక్కడే కనిపిస్తాయి. ఏదైనా మనం చూసే కోణమే తేడా. నీటి చుక్కను భూతద్దంలో పెట్టుకున్నంత పెద్దది చేసుకునే మానవ ప్రయత్నం.. దోసిట నీళ్లను ఎడారిలో విసిరేసే మూర్ఖత్వం రెండూ ఇక్కడివే. మన కథ ఏం కానుందో మునుముందు తెలియాలి.

### మూడు దేశాలు.. ముచ్చటైన ఒప్పందం

ఆఫ్రికా దేశాలంటే కరవు, నీటి కొరతే గుర్తొస్తుంది. కానీ, నమీబియా ఎడారి పక్కన ఉండే బోట్స్వానా దేశంలో మాత్రం ఎక్కడ చూసినా తేట నీరు పారుతూ కనిపిస్తుంది. జలచరాలు హిప్పోపొటామస్‌లకు ఇది స్వర్గధామం అనేంతగా ఇక్కడ నీటి ఊట ఊరుతుంటుంది. అదేదో ప్రకృతి ప్రసాదం అనుకుంటే పొరపాటే. ఒక ఎడారి ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసిన ఈ కథ అచ్చంగా మానవ ప్రయత్న విజయం. నీటి సమర్థ నిర్వహణకు అసలైన తార్కాణం.

ఈ కథ తెలియాలంటే అక్కడి ఒకవాంగో నది గురించి తెలుసుకోవాలి. ఇది అంగోలా దేశంలో పుడుతుంది. అంగోలా నుంచి నమీబియా దేశం గుండా బోట్స్వానా దేశానికి ప్రవహిస్తుంది. అయితే ఇది అక్కడి కలహరి ఎడారిలోకి మళ్లీ అక్కడే ఆవిరై పోతుంది. నిజానికి నదులు సముద్రంలో కలవాలి. కానీ ఇక్కడి వాతావరణం కారణంగా.. ఎడారిలో అంతమవుతుంది. ఈ నది పుట్టే అంగోలా దేశంలో వర్షపాతం బాగానే ఉంటుంది. కానీ నమీబియా, బోట్స్వానాల్లో పరిస్థితి అలా కాదు. దీంతో కరవు, నీటి ఎద్దడి ఈ దేశాల్ని ఇబ్బంది పెడుతుండేవి. నీటి విషయమై దేశాల మధ్య ఘర్షణలు జరుగుతుండేవి. ఇది 1994కు ముందు పరిస్థితి. ఆ ఏడాది ఐక్యరాజ్య సమితి సలహాతో మూడు దేశాలు పర్మినెంట్ ఒకవాంగో రివర్ బేసిన్ వాటర్ కమిషన్‌ను ఏర్పాటు చేసుకున్నాయి. ఆయా ప్రాంతాల్లో ఉండే నదుల్ని అనుసంధానం చేస్తూ మూడు దేశాలు నీటిని సద్వినియోగం చేసుకోవడం మీద చర్చించుకున్నాయి. అప్పటి నుంచి ఇప్పటి దాకా నీటి నిర్వహణ, వినియోగం, కాలుష్యాల నుంచి నదిని కాపాడుకోవడంలాంటి విషయాల మీద ఎప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకుంటూ ఉమ్మడిగా ముందుకు పోతున్నాయి. మూడు దేశాల్లో ఉన్న నదులు, నీటి పాయల్ని అనుసంధానం చేసుకుంటూ సుమారు పదహారు వందల కిలోమీటర్ల దూరం సాగుతుంది ఈ ప్రవాహం. కలహరి ఎడారిలోని ప్రపంచంలోనే అతి పెద్ద సహజ ఒయాసిస్సుల్లో ఒకటైన ఒకవాంగో డెల్టా ఈ నది చివరి మజిలీ.



### సింగపూర్ ఎలా బతుకుతున్నది..

సింగపూర్ ఓ ద్వీపదేశం. కొండలు లేవు. పెద్ద నదులు, సరస్సులు, హిమానీనదాల్లాంటి సహజ నీటి వనరులు లేనేలేవు. కానీ ప్రపంచంలోనే శుభ్రమైన తాగునీరు అందించే దేశాల జాబితాలో ముందు వరుసలో ఉంటుంది. అది ఎలా సాధ్యమైంది అన్నది సింగపూర్ నీటి వనరులు - నిర్వహణ గురించి చదివితే తెలుస్తుంది.

సింగపూర్ తమ నీటి వనరుల్ని నాలుగు విధాలుగా సమకూర్చుకుంటున్నది. వాటినే వాళ్లు నాలుగు నేషనల్ ట్యాప్స్‌గా పిలుస్తున్నారు. అందులో మొదటిది వాన నీరు. చుట్టూ నీరు ఉండే ఈ దేశంలో వర్షపాతం ఎక్కువే. కానీ అది భూగర్భ జలాలను పెంచేంతగా ఇంకడానికి అక్కడ తగినంత నేల లేదు. అందుకే కాలువలు, రిజర్వాయర్ల ద్వారా వాన నీటిని ఒడిసి

